ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 13.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ లో ఈరోజు నిర్వహించే MUSI INVITES కార్యక్రమం - మూసీ నది పునరుజ్జీవనం, అభివృద్ధి ప్రణాళికలు, తదితర అంశాలను వివరించనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు.

2. కామారెడ్డి జిల్లాలో ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు.

3. రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

4. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత అంశంపై మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఈరోజు బహిరంగ లేఖ రాశారు.

**రేవంత్ రెడ్డి - "MUSI INVITES"**

హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో ఈరోజు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో "MUSI INVITES" కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు, పర్యావరణ నిపుణులు, ఆర్కిటెక్టులు

పాల్గొననున్నారు. మూసీ నది పునరుజ్జీవనం, రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదిత ప్రణాళికలను ప్రభుత్వం ఈ సందర్భంగా ఆవిష్కరించనుంది. స్వచ్ఛమైన నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల ఏర్పాటుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణ ఇవ్వనున్నారు. ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో గాంధీ సరోవర్ పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పిటిసి, హైదరాబాద్

**పొన్నం ప్రభాకర్**

మూసీ పునరుజ్జీవం విషయంలో విపక్షాలు అనవసరంగా రాజకీయం చేస్తున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, మూసీ ప్రాజెక్టుపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. విపక్షాలు అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని, బాపూ ఘాట్ విషయంలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన కార్యాచరణను వివరించడానికి ఇవాళ సాయంత్రం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని వెల్లడించారు. గత పదేళ్లలో మూసీని విస్మరించిన బీఆర్ఎస్ పార్టీకి ఈ ప్రాజెక్టును విమర్శించే నైతిక హక్కు లేదని మంత్రి అన్నారు.

పిటిసి, హైదరాబాద్

**జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్**

తెలంగాణలో మహిళల భద్రతకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహట్కర్ అభినందించారు. మేడ్చల్ - మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన 'మహిళా జన సున్వాయి' కార్యక్రమంలో ఆమె పాల్గొని, బాధితుల నుంచి అందిన సుమారు 35 ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. గృహ హింస, సైబర్ నేరాలపై సత్వర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను

ఆదేశించారు. మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేస్తూ, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో అండగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిజిపి శివధర్ రెడ్డి, సిపి అవినాష్ మహంతి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిటిసి, మల్కాజిగిరి

**కామారెడ్డి ఎమ్మెల్యే**

కామారెడ్డి జిల్లాలో ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి తక్కువ దూరంలో జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ భూమి కూడా సమృద్ధిగా ఉన్నందున ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ అకాడమీ ఏర్పాటుతో కామారెడ్డి జిల్లా అభివృద్ధి చెందటమే కాకుండా స్థానిక యువతకు పైలెట్ శిక్షణ లభించి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

పిటిసి, కామారెడ్డి

**ట్రాఫిక్ మళ్లింపులు**

హైదరాబాద్‌లోని అశోక్ నగర్, ముషీరాబాద్ పరిసరాల్లో హుస్సేన్ సాగర్ నాలా వంతెన కూల్చివేత, పునర్నిర్మాణ పనుల దృష్ట్యా నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపులు అమల్లోకి వస్తాయని జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్, హిమాయత్ నగర్ నుంచి ఇందిరాపార్క్ వెళ్లే వాహనదారులు అశోక్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద మళ్లి, సబ్ రిజిస్టర్ కార్యాలయం, బాకారం బ్రిడ్జి, బండ మైసమ్మ మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవాలి. ముఖ్యంగా అశోక్ నగర్, స్టీల్ బ్రిడ్జి పిల్లర్ల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు సహకరించాలని కోరారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్ లైన్ నంబర్ 9010203626ను సంప్రదించవచ్చు.

పిటిసి, హైదరాబాద్

**SHIVRAJ - PM KISAN SAMMAN NIDHI**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు అస్సాంలోని గౌహతి నుండి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) 22వ విడత నిధులను విడుదల చేస్తారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. దాదాపు 9 కోట్ల 32 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు 18 వేల 640 కోట్ల రూపాయలను నేరుగా విడుదల చేస్తారని శివరాజ్ సింగ్ పేర్కొన్నారు.

**BYTE … SHIVRAJ SINGH**

NSD

**ఇఫ్తార్ విందు**

రంజాన్ ఉపవాసాల సందర్బంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారిక ఇఫ్తార్ విందు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యే కోవలక్ష్మి తదితరలు హాజరై మైనారిటీలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేసి, వారితో కలిసి విందులో పాల్గొన్నారు. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్ధికంగా ఎదగాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. అధికారిక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పట్ల ప్రభుత్వానికి ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్

**NIFT**

హైదరాబాద్ నిఫ్ట్ క్యాంపస్‌లో 'క్రాఫ్ట్ స్కేప్ - హస్తకళా మహోత్సవ్ 2026' పేరిట మూడు రోజుల ఆర్టిజన్ అవేర్‌నెస్ వర్క్ షాప్, క్రాఫ్ట్ బజార్ ఘనంగా ప్రారంభమయ్యాయి. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన గుమ్మల్లా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా సృజన గుమ్మాల మాట్లాడుతూ... సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో హస్తకళలు కీలక పోషిస్తాయని అన్నారు. 14 వరకు జరిగే కార్యక్రమంలో కళాకారులుతమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు. కళాకారులకు మార్కెట్ అవకాశాలు కల్పించి,

విద్యార్థులకు భారతీయ హస్తకళల వైవిధ్యంపై అవగాహన కల్పించడమే ఈ వేడుక ప్రధాన ఉద్దేశమని నిఫ్ట్ యాజమాన్యం తెలిపింది.

పిటిసి, హైదరాబాద్

**పదవ తరగతి వార్షిక పరీక్షలు**

రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 వేల 676 పరీక్షా కేంద్రాలలో మొత్తం 5 లక్షల 28 వేల 239 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష సమయానికి ఐదు నిమిషాల తర్వాత కూడా అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

పదవ తరగతి వార్షిక పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్మల్ జిల్లా జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 47 పరీక్ష కేంద్రాలు 9 వేల 758 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

కామారెడ్డి జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. రేపటి నుంచి ఏప్రిల్ 16 వరకు జరిగే ఈ పరీక్షలకు 65 కేంద్రాల్లో 13 వేల 154 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అధికారిక వెబ్సైట్ నుండి హాల్ టికెట్లు పొందవచ్చని, సందేహాల కోసం 99596 70118 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అసిఫాబాద్ జిల్లాలో రేపటి నుండి వచ్చే నెల 16వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారిని లలిత తెలిపారు. జిల్లాలో మొత్తం 6 వేల 949 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వీరి కోసం 38 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత ఒక

ప్రకటనలో తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పిటిసి, ఆసిఫాబాద్, వరంగల్, నిర్మల్, కామారెడ్డి

**హరీశ్ రావు**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ పై మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. రాజ్యాంగాన్ని రక్షిస్తామని, పార్టీ ఫిరాయింపులను అడ్డుకుంటామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ, తెలంగాణలో దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినా, ఆయన పార్టీ మారలేదనడం రాజ్యాంగ నైతికతకే విరుద్ధమని వెల్లడించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన వ్యక్తి మరో పార్టీ బీ-ఫామ్ తీసుకోవడం కంటే పెద్ద ఆధారం ఏం కావాలని, ఈ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని సమర్థిస్తారా లేక చర్యలకు ఆదేశిస్తారా అని స్పష్టం చేయాలని కోరారు.

డెస్క్

**మెదక్ జిల్లా కలెక్టర్**

మెదక్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ఉద్దేశించిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. మహిళల్లో ఈ వ్యాధి నివారణకు టీకా ఎంతో కీలకమని, 15 ఏళ్లలోపు బాలికలకు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దీనిని ఉచితంగా అందిస్తామని ఆమె తెలిపారు.

పిటిసి, మెదక్

**నల్గొండ జిల్లా కలెక్టర్**

పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో నల్గొండ జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

పిటిసి, నల్గొండ

**నివాళి**

హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బూర్గుల రామకృష్ణారావు రాష్ట్రానికి అందించిన సేవలను, వారి పరిపాలనా దక్షతను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు.

డెస్క్

**పూడికతీత పనులు**

వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువులో రెండో విడత పూడికతీత పనులను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఈ పనులను చేపట్టింది.

పిటిసి, వరంగల్